సర్వే షురూ..

- పకడ్బందీగా సమగ్ర కుటుంబ సర్వే
- ఇంటింటికి తిరిగి వివరాల సేకరణ
- సర్వే సిబ్బందికి సహకరించాలి: అధికారులు
- పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు

ఎల్బీనగర్, నవంబర్ 6: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ఎల్బీనగర్ నియోజకవర్గం సరూర్‌నగర్, హయత్‌నగర్, ఎల్బీనగర్ సర్కిళ్ల పరిధిలోని 13 డివిజన్లలో సమగ్ర సర్వే ప్రారంభమైంది. గడ్డిఅన్నారం డివిజన్ సీసల బస్తీలో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొని సర్వే జరుగుతున్న తీరును పరిశీలించడంతో పాటు సిబ్బందితో కలిసి నివాసాల్లో సమగ్ర సర్వేలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమహేశ్వర్ రెడ్డి, బిచినేపల్లి వెంకటేశ్వర్‌రావు, మాజీ కార్పొరేటర్ ప్రవీణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, రమేశ్ ముదిరాజ్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

పాల్గొన్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా..

సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వేలో గడ్డిఅన్నారం డివిజన్‌లోని సీసల బస్తీలో కార్పొరేటర్ బద్దం ప్రేం మహేశ్వర్‌రెడ్డి, ఉప కమిషనర్ సుజాతతో కలిసి పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో సమగ్ర సర్వే చేపట్టి అన్ని వివరాలు తెలుసుకునేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సర్వే చేపట్టిందన్నారు. అన్ని వివరాలను అందించి సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేటర్ పవన్‌కుమార్ నివాసం నుంచి..

కొత్తపేట డివిజన్‌లో సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని కార్పొరేటర్ పవన్‌కుమార్ తన స్వగృహం నుంచి ప్రారంభించారు. కార్పొరేటర్ పవన్ నివాసానికి జీహెచ్ ఎంసీ ఎన్యూమరేషన్ సిబ్బందితో పాటు సరూర్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ సుజాత విచ్చేసి కార్పొరేటర్ నివాసంలో సమాచారం సేకరించి సర్వేను ప్రారంభించారు.

సమగ్ర సర్వే షురూ..

కందుకూరు: మండలంలోని 35 గ్రామ పంచాయతీలు, అనుబంధ గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీఓ గీత, తాసీల్దార్ గోపాల్ తెలిపారు. వివిధ గ్రామాల్లో పర్యటించి సర్వే వివరాలను వివరాలను తెలుసుకున్నారు.

కులగణన సర్వేను సమగ్రంగా చేయాలి

సైదాబాద్, నబంబర్ 6: సమగ్ర కుటుంబ సర్వేను బుధవారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని రెడ్డిబస్తీలో స్థానిక కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్ ఏఎంసీ సంజయ్‌సింగ్, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ సుకన్య, రాజు, బిల్ కలెక్టర్ మనోహర్, ఎన్యూమరేటర్లు, బీఎల్‌వోలు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేకు సహకరించాలి

మలక్‌పేట, నవంబర్ 6: మూసారాంబాగ్ డివిజన్‌లో అధికారులు నిర్వహించే సమగ్ర సర్వేకు ప్రజలంతా సహకరించాలని మూసారాంబాగ్ కార్పొరేటర్ బి.భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం డివిజన్‌లో చేపట్టిన సమగ్ర సర్వేను అధికారులతో కలిసి ప్రారంభించారు. బుధవారం సర్కిల్-6 ఉప కమిషనర్ జయంత్ నేతృత్వంలో జీహెచ్‌ఎంసీ ఏఎంసీ మురళీమోహన్, అధికారులు, సిబ్బందితో కలిసి ఇంటింటికి స్టిక్కరింగ్ చేశారు. అదేవిధంగా పాత మలక్‌పేట డివిజన్‌లో కూడా ఎన్యూమరేటర్లు ఇంటింటికి తిరిగి స్టిక్కరింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీ తదితరులు పాల్గొన్నారు.

మూసారాంబాగ్ డివిజన్‌లో సర్వేను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఏఎంసీ మురళీమోహన్, అధికారులు

పాత మలక్‌పేట డివిజన్‌లో సమగ్ర సర్వేకు సంబంధించి ఇంటింటికి సిక్కర్లు అంటిస్తున్న అధికారులతో డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీ

గడ్డిఅన్నారం డివిజన్ సీసల బస్తీలో సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ తదితరులు

గడ్డిఅన్నారంలో సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, కార్పొరేటర్ బద్దం ప్రేంమహేశ్వర్‌రెడ్డి, ఉప కమిషనర్ సుజాత తదితరులు

కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ నివాసంలో కుటుంబ సర్వే చేస్తున్న ఉప కమిషనర్ సుజాత, సిబ్బంది

కందుకూరులో సర్వే వివరాలు తెలుసుకుంటున్న ఎంపీఓ గీత, తాసీల్దార్ గోపాల్

సైదాబాద్ రెడ్డిబస్తీలో సమగ్ర సర్వేలో పాల్గొన్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులు, ఎన్యూమరేటర్లు

కులగణన సర్వేలో కుమ్మరుల కుల సంఖ్య తేలాలి

చంపాపేట, నవంబర్ 6: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణన సర్వేలో కుమ్మరులందరూ పాల్గొనాలని కుమ్మర సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నడికుడ జయంత్‌రావు, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్ తెలిపారు. బుధవారం సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం లింగోజిగూడ డివిజన్ పరిధి సరూర్‌నగర్‌లోని కుమ్మర సంఘం భవన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నడికుడ జయంత్‌రావు, మల్కాజిగిరి దయానంద్ పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కులగణన సర్వేలో ప్రతి ఒక్కరి ఇండ్ల ముందుకు వచ్చే అధికారులు మీది ఏ కులం అని అడిగే క్రమంలో కుమ్మరులందరూ బీసీతో పాటు కుమ్మరిగా నమోదు చేసుకోవాలని తెలిపారు. దీంతో రాష్ట్రంలో కుమ్మరి కులస్తులు జనాభా ఎంత ఉందో ప్రభుత్వానికి తెలుస్తుందని తెలిపారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు అభినందనీయం

ఎల్బీనగర్, నవంబర్ 6: ప్రజల ప్రాణాలను కాపాడేందుకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎల్బీనగర్ ఏసీపీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బుధవారం శ్రీ చైతన్య విద్యాసంస్థ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ బొప్పన ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదినం సందర్భంగా ఎల్బీనగర్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఎల్బీనగర్ జోనల్ క్యాంపస్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమని.. శ్రీ చైతన్య విద్యాసంస్థ వారు రక్తదాన శిబిరాన్ని నిర్వహించి సమాజ సేవలోనూ అడుగులు వేయడం హర్షణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీవీ నటి స్వర్ణ, శ్రీ చైతన్య సంస్థ ఎక్జూకూటివ్ ఏజీఎం సీహెచ్. శ్రీధర్, ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్, శ్రీ చైతన్య జోన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్బీనగర్ శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏసీపీ ప్రవీణ్‌కుమార్

యువత మత్తు పదార్థాల బారిన పడకుండా చూడాలి

బాలల హక్కుల పరిరక్షణ కోసం చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

మన్సూరాబాద్, నవంబర్ 6: బాలల హక్కుల పరిరక్షణ కోసం చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను బుధవారం నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువు, స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణ హక్కులను అమలుచేసి బాలల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. డ్రగ్స్, గంజాయి, కొకైన్ లాంటి మత్తు పదార్థాల వలన యువత భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. యువత చెడు మార్గంలో పయనించకుండా చూడాల్సిన బాధ్యత కుటంబసభ్యులపై ఉందని.. ప్రతి రోజు వారి దినచర్యను ఒక కంట కనిపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. తమ పిల్లల్లో ఏమైనా మార్పులు ఉన్నాయంటే వాటిని సరిదిద్దేందుకు ప్రయత్నించి సన్మార్గంలో నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజాసేవ అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మార్గం రాజేశ్‌కు సేవా భూషణ్ పురస్కారం

ఆర్కేపురం, నవంబర్ 6: చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభ హాల్‌లో యువ ఆర్ట్ థియేటర్ 21వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వైద్య, సేవా రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న ప్రముఖులకు అవార్డులతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మాజీ మంత్రి డా.సముద్రాల వేణుగోపాలచారి హాజరయ్యారు. అనాథ విద్యార్థులను చేరదీసి వారి బంగారు భవిష్యత్తుకు కృషి చేస్తున్న ఎల్బీనగర్ అనాథ విద్యార్థి గృహ అధ్యక్షుడు మార్గం రాజేశ్‌కు సేవా భూషణ్ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాలచారి మాట్లాడుతూ.. అనాథ, నిరుపేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు అహర్నిశలు కృషి చేస్తున్న మార్గం రాజేశ్‌ను సేవా భూషణ్ పురస్కారానికి పూర్తి అర్హుడని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా.బీఆర్.వెంకటరమణ, మందడి కృష్ణారెడ్డి, రాజకుమారి, చంద్రకాంతారావు తదితరులు ఉన్నారు.

గణేశ్‌నగర్‌కాలనీ ఫేజ్-1 సమస్యలను పరిష్కరించండి

గణేశ్‌నగర్‌కాలనీ ఫేజ్-1లో ధ్వంసమైన రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, నవంబర్ 6: జాతీయ రహదారి అభివృద్ధి పనుల వలన సమీపంలోని కాలనీలకు వెళ్లే మార్గాలు దెబ్బతిన డంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. బుధవారం గణేశ్‌నగర్ ఫేజ్-1లో పర్యటించి జాతీయ రహదారి పనుల వలన కాలనీకి వెళ్లే మార్గంలో దెబ్బతిన్న అంతర్గత రోడ్లను పరిశీలించారు. ప్రజలు, వాహనదారుల ఇబ్బందులను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ రోడ్డుపై బైటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారి పనుల వలన రోడ్లతో పాటు యూజీడీ పైపులైన్ వ్యవస్థ ధ్వంసమై కాలనీ మురుగునీటి కుంటగా మారిపోయిందన్నారు. సమస్య తీవ్రతను గత జీహెచ్‌ఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని ఆమె ఆదేశాలు జారీ చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే ప్రజలతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు సత్యనారాయణ, సతీశ్‌చంద్, సుధాకర్, రమేశ్, మురళీధర్, గణాచారి, రఘుపతి, శ్రీధర్‌రెడ్డి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

చెరువు కబ్జాకు యత్నం.. కాపాడాలని వినతి

తాసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం పార్టీ నాయకులు

కందుకూరు, నవంబర్ 6: నేదునూరులోని ఎర్రకుంట చెరువును కబ్జా నుంచి కాపాడాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి శ్రీనివాస్ కోరారు. బుధవారం తాసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కుమార్, నేదునూరు గ్రామ కమిటీ కన్వీనర్ యాదయ్య, సురేశ్, నాగన్న, శ్రీహరి, నర్సింహ, శ్రీనివాస్, భిక్షపతి, శ్రీనివాస్, లక్ష్మయ్య, జంగయ్య పాల్గొన్నారు.

ఎంఈ, ఎంటెక్ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 6: ఓయూ పరిధిలోని ఎంఈ, ఎంటెక్ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల ఎంఈ, ఎంటెక్ (ఏఐసీటీఈ) మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను రెండు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈనెల 12వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 14వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

పోస్ట్ ఎమ్మెస్సీ డిప్లామా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ కోర్సు నోటిఫికేషన్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 6: ఓయూ పరిధిలోని పోస్ట్ ఎమ్మెస్సీ డిప్లామా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ కోర్సులో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ.పాండురంగారెడ్డి తెలిపారు. నగరంలోని పలు ప్రముఖ ఆస్పత్రుల సహకారంతో ఫిజిక్స్ విభాగం అందిస్తున్న ఈ కోర్సులో చేరేందుకు ఫిజిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్‌లో కనీసం 60శాతం మార్కులతో పీజీ పూర్తి చేసి ఉండాలని చెప్పారు. ఎంట్రెన్స్ ద్వారా ప్రవేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈనెల 11వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు స్వీకరించనున్నట్టు చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 10వ తేదీ వరకు స్వీకరిస్తామని అన్నారు. ప్రవేశ పరీక్షను వచ్చే నెల 14న నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు www.ouadmissions.com, www.osmania.ac.in వెబ్‌సైట్‌లలో చూసుకోవచ్చని సూచించారు.

రోడ్డు కబ్జాను అడ్డుకున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

మన్సూరాబాద్, నవంబర్ 6: మన్సూరాబాద్ సర్వే నం. 32, 33, 34, 35 జడ్జెస్‌కాలనీలో రోడ్డును కబ్జా చేసి జరుపుతున్న నిర్మాణాలను బుధవారం జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. కొందరు రాత్రికి రాత్రే రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని కాలనీవాసుల ఫిర్యాదుకు జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి కబ్జాను అడ్డుకున్నారు. జోనల్ కమిషనర్ హేమంత కేశవ్‌పాటిల్, డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, టౌన్ ప్లానింగ్ ఏసీపీ విజయశ్రీ జడ్జెస్‌కాలనీలోని రోడ్డు ఆక్రమణను పరిశీలించారు. ప్రభుత్వ భూములు, కాలనీలోని రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జడ్జెస్‌కాలనీ బార్డర్‌లో ఉన్న రోడ్డు స్థలంలో మొక్కలను నాటి పర్యావరణాన్ని పెంపొందించాలని లేనిపక్షంలో స్థలం కబ్జాకు గురయ్యే అవకాశం ఉందని కాలనీవాసులు టౌన్‌ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా సహారాస్టేట్స్‌కాలనీకి వెళ్లే గేటు నం.2 మార్గంలో రోడ్డుకు ఆనుకుని వేసిన ర్యాంపును తొలగించారు.

సభ్యత్వ నమోదుకు స్పందన

ఆర్కేపురం, నవంబర్ 6: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, ఆర్కేపురం కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆర్కేపురం డివిజన్‌లో బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి బీబీ ఆర్.వేణు, బీజేపీ గీత సెల్ కో-కన్వీనర్ ఆర్.కిరణ్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్ట ఉపేందర్‌రెడ్డి, బుక్క రమేశ్, ముంత రాములు, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, జనార్దన్, సైదయ్య, రాంప్రసాద్ ఉన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు 26 వరకు చెల్లించండి

సైదాబాద్, నబంబర్ 6: ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లింపు తేదీలను ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిందని మలక్‌పేట ప్రభుత్వ జూనియర్ (బాలికల) కళాశాల ప్రిన్సిపాల్ అరుణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్ 6 నుంచి 26వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లింపునకు అవకాశం ఉందని తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో డిసెంబర్ 4వ తేదీ వరకు చెల్లించవచ్చని తెలిపారు. జూనియర్, సీనియర్ ఇంటర్ జనరల్, ఆర్ట్స్ విద్యార్థులకు రూ.520 ఫీజును, సైన్స్ విద్యార్థులకు రూ.750 పరీక్ష ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, నబంబర్ 6: ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా గురువారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆస్మాన్‌ఘడ్ డివిజన్ డీఈ విష్ణువర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11కేవీ ఎల్ఐసీ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 11కేవీ ఆస్మాన్‌ఘడ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా ఫీడర్ల పరిధిలోని పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని.. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

సైన్స్ టాలెంట్ టెస్టును విజయవంతం చేయాలి

కందుకూరులో వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం అంజయ్య, టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

కందుకూరు, నవంబర్ 6: సైన్స్ టాలెంట్ టెస్టును విజయవంతం చేయాలని కందుకూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు అంజయ్య తెలిపారు. టీస్ యూటీఎఫ్, ఉపాధ్యాయ సంఘం, జన విజ్ఞాన వేదిక సంయుక్తంగా నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు వాల్ పోస్టర్‌ను కందుకూరు జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో టీస్ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు జగన్నాథ్ శర్మ, కల్పన, డాక్టర్ ఎడ్ల కల్లేశ్, డాక్టర్ బుగ్గరాములు ఉపాధ్యాయ బృందంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాటంతో పాటు మన వృత్తి మూల ధారమైన విద్యార్థుల్లో దాగిఉన్న విజ్ఞానాన్ని ప్రోత్సహించడం కోసం టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఎంతో కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. జేవీవీ, మండల టీస్ యూటీఎఫ్ కలిసి నిర్వహిస్తున్న టాలెంట్ టెస్టులో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలి

కందుకూరు, నవంబర్ 6: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా టీఎస్ యూటీఎఫ్ కోశాధికారి జగన్నాథ్‌శర్మ కోరారు. మండల కేంద్రంలో టీఎఫ్ యూటీఎఫ్ మండల సభ నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల నూతన అధ్యక్షుడిగా రవి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ బుగ్గరాములు, ఉపాధ్యక్షులుగా అమృత, ఈశ్వర్, కార్యదర్శులుగా శేఖర్, సత్యనారాయణ, వెంకటచారి, శ్రీరామ్, శ్రీలత, సద్గుణ, యాదయ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా నజీర్ ఉస్సేన్, చెన్నయ్య, జిల్లా ప్రతినిధులుగా నర్సింహులు, జంగయ్య, లక్ష్మణ్ నాయక్, బుక్యానాయక్, రాజిరెడ్డి, విజయలక్ష్మి, జయపాల్, సాంస్కృతిక కన్వీనర్‌గా మల్లీశ్వరి, స్కూల్ ఇన్‌చార్జిలుగా శ్రీలత, హేమలతను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం అంజయ్య, పరిశీలకులు కల్పన పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం

సైదాబాద్, నబంబర్ 6: కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఏ.అమర్నాథ్ (56) అనారోగ్యంతో బుధవారం మరణించారు. గుర్రంగూడలోని ఎస్వీ కాలనీలో నివాసముండే అమర్నాథ్ (2019 నుంచి సిటీ స్పెషల్ బ్రాంచ్ అటాచ్‌గా)గా పనిచేస్తున్నారు. కొంతకాలంలో కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఎల్బీనగర్‌లోని హైదరాబాద్ పునరావాస కేంద్రంలో చికిత్స పొందుతున్న ఆయన బుధవారం ఉదయం మరణించారు. దీంతో హైదరాబాద్ సిటీ పోలీసుల తరుపున అమర్నాథ్ కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం రూ.20వేలు అందజేశారు. అమర్నాథ్ కుటుంబ సభ్యులను నగర పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర్ రెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది, మిత్రులు తదితరులు పరామర్శించి, వారికి మనోధైర్యం కల్పించారు.